సాక్షి
జనగామ
ఆదివారం | 8 | జూన్ | 2025



వినియోగం వెనుక ప్రమాదం

ప్లాస్టిక్ బాటిళ్లను సక్రమంగా శుభ్రం చేయకుంటే రోగాల బారిన పడడం ఖాయమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

- 10లో ▸



'ఓపెన్ స్కూల్' పరీక్షల ఫలితాలు విడుదల

ఈ ఏడాది ఏప్రిల్ నెలలో నిర్వహించిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
39^0 / 27^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యాన వార కల్యాణాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు వైభవంగా నిర్వహించారు. వేడుకను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు హైదరాబాద్‌కు చెందిన చాగంటి రామకృష్ణ–కృష్ణవేణి దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి



జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా 4 లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు యాటల సోమన్న, సుంచు విజేందర్, అన్నబోయిన రాజు, చిట్యాల సోమన్న, జోగు ప్రకాష్, బూడిద ప్రశాంత్, తాండ్ర ఆనందం, బత్తిని వెంకన్న పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ సాకారం



దేవరుప్పుల : కేసీఆర్ ఉద్యమంతోనే తెలంగాణ కల సాకారం అయిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం అమెరికా దేశం వాషింగ్టన్, సియాటిల్‌లోని వాటా, వాట్స్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని రాజకీయ అడ్డంకులు వచ్చినా అధిగమించేందుకు సమస్త తెలంగాణ సమాజాన్ని కూడగట్టుకొని ప్రత్యేక రాష్ట్రం సాధించి శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. నాడు ఎన్‌టీఆర్.. మొన్న కేసీఆర్ విజన్‌తో పరిపాలన సాగిస్తే.. కొందరు విమర్శలు చేయడం శోచనీయమన్నారు. విదేశాలకు వచ్చినా స్వదేశీ అభివృద్ధిపై ఎన్‌ఆర్‌ఐల తోడ్పాటు అభినందనీయమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారెడ్డి, సుమన్, గండ్ర వెంకటరమణారెడ్డి దంపతులు, ఎన్‌ఆర్‌ఐలు వంశీరెడ్డి, రాజేష్, సందీప్, గణేష్ వీరమనేని, మాణిక్యం, ప్రదీప్ పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గా మైదానాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు ధార్మిక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా పండుగ విశిష్టత, హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతిని వివరించారు. ప్రతి ఒక్కరూ అల్లాహ్ చూపిన మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం ముస్లింలు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు ఈద్గా వద్దకు చేరుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

మరిన్ని చిత్రాలు 11లో

- జనగామ




జనగామ పట్టణంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ధార్మిక ప్రసంగం చేస్తున్న మత పెద్ద




స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పాలకుర్తిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బడి బస్.. ఫిట్‌లెస్!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పూర్తికాని బడి బస్సుల పరీక్షలు



ఉమ్మడి జిల్లాలో ఇలా..

మొత్తం
1820 863 917

- మొత్తం బస్సులు
- ఫిట్‌నెస్ చేసుకున్నవి
- చేయించుకోవాల్సినవి

'పిల్లలున్నారు జాగ్రత్త' అని బడి బస్సుల వెనకాల రాసి ఉంటుంది. కానీ.. చాలా బస్సుల నిర్వాహకులు మాత్రం.. ఆ విషయాన్నే మరిచిపోతున్నారు. నిబంధనల ప్రకారం.. ఏటా పాఠశాలల ప్రారంభానికి ముందే బడి బస్సులకు ఫిట్‌నెస్‌పరీక్షలు చేయించుకోవాలి. కానీ క్షేత్రస్థాయిలో అవేమీ అమలు కావడం లేదనే విమర్శలున్నాయి.

- సాక్షి, వరంగల్/ఖిలా వరంగల్



వరంగల్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ కోసం వచ్చిన ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు

- 1,820కి ఇప్పటివరకు పూర్తి చేసుకుంది 863
- పరీక్షలు చేసుకోవాల్సింది 917..
- ఫిట్‌నెస్ తనిఖీలకు రాని వందల బస్సులు
- ఈనెల 12న పాఠశాల పునఃప్రారంభంతో చర్చ
- స్పెషల్ డ్రైవ్‌లకు సిద్ధమవుతున్న ఆర్టీఏ అధికారులు

బడి గంట మోగే సమయం ఆసన్నమవుతోంది.. ఇప్పటికే అడ్మిషన్ల బిజీలో ఉన్న పాఠశాలలు బడి బస్సుల భద్రతపై దృష్టి సారించడం లేదు. ప్రతీ ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఫిట్‌నెస్ పరీక్షలకు వందలాది బస్సులు దూరంగా ఉండడం తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,820 పాఠశాలల, కాలేజీల బస్సులు ఉన్నా.. ఇప్పటివరకు 863 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు పొందాయి. పదిహేనేళ్ల కాల పరిమితి పూర్తి చేసుకున్నా.. వివిధ కారణాల చేత 225 బస్సులను అధికారులు ఫిట్‌నెస్ చేయకుండా తిరస్కరించారు. ఇంకా మిగిలిన 692 బస్సులకు ఆన్‌లైన్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తీసుకోవాలి. మరో ఐదు రోజులు మాత్రమే సమయం ఉండడంతో ఆయా బస్సులు వచ్చి సాధ్యమైనంత త్వరగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ఆర్టీఏ అధికారులు కోరుతున్నారు. ఫిట్‌నెస్ పరీక్షల్లో పాసైతే విద్యార్థుల భద్రతకు భరోసా ఉంటుందని చెబుతున్నారు. 'యాభై రోజులకుపైగా మూసి ఉన్న విద్యాసంస్థలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఇన్నాళ్లూ విద్యార్థులను తరలించే బస్సులు షెడ్డుకే పరిమితమయ్యాయి. వాటి సామర్థ్య పరీక్షల గడువు కూడా మే 15కే ముగిసింది. ఇప్పటికీ ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోని బడి బస్సులు వచ్చి త్వరగా చేసుకోవాలి' అని వరంగల్ ఆర్టీఓ శోభన్‌బాబు కోరారు.

ఇలా చేస్తే మంచిది..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలను సంబంధిత అధికారులు తూతూ మంత్రంగానే నిర్వహిస్తున్నారు. కనీసం పది నిమిషాలైనా చెక్ చేయకుండానే బస్సులను పంపించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం అధికారులు అప్రమత్తమవుతున్నారని.. ప్రమాదాలు జరగకుండా ముందుగానే బస్సుల తనిఖీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. 'పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి బస్సు ఫిట్‌నెస్ పకడ్బందీగా చూడాలి. చాలా పాఠశాలలకు ఎక్కువ సంఖ్యలో బస్సులుంటాయి. ఒకటి రెండు బస్సులను చూసే ఫిట్‌నెస్ అయ్యిందని మమ అనిపించకుండా ప్రతి బస్సును చెక్ చేయాలి. నెల, రెండు నెలలకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి బస్సుల పరిస్థితి డ్రైవర్ల పరిస్థితి చెక్ చేస్తూ ఉండాలి. ఏవైనా లోపాలు ఉంటే ఒత్తిళ్లకు లొంగకుండా బస్సును సీజ్ చేయాలి' అని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఇవీ నిబంధనలు..

- 15 ఏళ్లు నిండిన వాహనాలను స్టూడెంట్స్ రవాణాకు ఉపయోగించకూడదు. స్కూల్ బస్సు పూర్తి కండిషన్‌లో ఉండాలి.
- విద్యా సంస్థ పేరు, సెల్‌ఫోన్ నంబరు, పూర్తి అడ్రస్ బస్సు ఎడమ వైపు, ముందు భాగంలో స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- ప్రతీ విద్యాసంస్థ యాజమాన్యం డ్రైవర్ ఆరోగ్య పట్టిక నిర్వహించాలి.
- డ్రైవర్ షుగర్, బీపీ, కంటిచూపు వంటి ప్రాథమిక పరీక్షలను ప్రతి 3 నెలలకోసారి చేయించాలి. డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం తప్పనిసరి.
- బస్సులో ప్రథమ చికిత్స పెట్టె అందుబాటులో ఉండాలి. అత్యవసర ద్వారం ఉండాలి. బస్సుకు సంబంధించి వైపర్స్, విండ్ స్క్రీన్, పార్కింగ్ లైట్స్, లైటింగ్ ఉండాలి.
- ప్రతి బస్సులో మంటలు ఆర్పే పరికరాలు ఉండాలి. డ్రైవర్‌కు విద్యార్థులు బస్సు ఎక్కడం, దిగడం స్పష్టంగా కన్పించేలా అద్దాలు అమర్చుకోవాలి.
- ప్రతి బస్సులో అటెండర్ ఉండాలి. బస్సులో ప్రయాణిస్తున్న స్టూడెంట్స్ పట్టిక కూడా ఉండాలి. బస్సులో స్టూడెంట్స్ బ్యాగులు పెట్టుకొనేలా అరలు ఏర్పాటు చేయాలి.
- కిటికీలకు మధ్యలో లోహపు కడ్డీలు కచ్చితంగా ఉండాలి.
- ఫుట్‌బోర్డ్‌పై మొదటి మెట్టు భూమికి 325 మిల్లీ మీటర్ల ఎత్తు మించకుండా చూడాలి. అన్ని మెట్లు జారకుండా లోహంతో నిర్మించాలి.

విస్తృత తనిఖీలు చేపడతాం..



విద్యాసంస్థల ప్రారంభంలోగా.. బస్సులన్నింటికీ సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి. లేకుంటే విస్తృత తనిఖీలు చేపట్టడం ద్వారా పట్టుబడిన వాహనాలు సీజ్ చేస్తాం. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తాం. పరీక్షలకు రాని బస్సులకు సంబంధించి యజమానులకు నోటీసులు పంపిస్తాం. అనుభవం ఉన్న డ్రైవర్ల నియామకం చేయాలి. పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- పురుషోత్తం, ఇన్‌చార్జ్ డీటీసీ, హనుమకొండ

డ్రైవర్లకు త్వరలోనే శిక్షణ



విద్యార్థుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. రవాణాశాఖ నిబంధనల మేరకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయిస్తున్నాం. ఐదేళ్ల అనుభవం ఉన్న డ్రైవర్లను నియమిస్తున్నాం. రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టనున్నాం. పిల్లలను జాగ్రత్తగా తరలించేందుకు డ్రైవర్లకు త్వరలోనే నిపుణుల చేత ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాం.

- గాదె స్వరూప్‌రెడ్డి, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

నేడు మృగశిర కార్తె

- జోరుగా చేపల అమ్మకాలు



జనగామ పట్టణంలో చేపల అమ్మకాలు

జనగామ: రోహిణి ముగిసి ఆదివారం(నేడు) మృగశిర కార్తె ఆరంభం కాబోతోంది. అయినా ఎండలు మండిపోతున్నాయి. పది రోజుల ముందు ముసురు వర్షాలతో వాతావరణం కాసింత చల్లబడినా తిరిగి ఒక్క సారిగా వేడెక్కింది. మృగశిర ప్రారంభం రోజు చేపలు తినడం వల్ల వానాకాలంలో వచ్చే వ్యాధులు దూరమవడమే కాకుండా గుండె జబ్బులు, అస్తమా వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుందని ప్రజల నమ్మకం. ఎండాకాలం తర్వాత వాతావరణం చల్లబడటంతో శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. వేడి ఉండేందుకు చేపలను తినడం ఆనవాయితీగా వస్తోంది. ముఖ్యంగా కొర్రమీను, రోహు, కట్ల, రవ్వ చేపలంటే చాలా మంది ఇష్టపడతారు. కొందరు ఏపీ నుంచి రొయ్యలు, ఇతర రకాల చేపలను ఆర్డర్‌పై తెప్పించుకుంటారు. జిల్లా కేంద్రంలో శనివారం ముందస్తుగానే మృగశిర చేపల విక్రయాలు జోరందుకున్నాయి. చాలా మంది కొనుగోలు చేస్తూ కనిపించారు.

300 మందికి వైద్య పరీక్షలు



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: ఫతేషాపూర్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామానికి చెందిన చింత మహేష్, పయ్యావుల రఘుపతి ఆధ్వర్యంలో యశోద నేత్రాలయ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరానికి వచ్చిన దాదాపు 300 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గొట్టం భాస్కర్‌రెడ్డి, గాజులపాటి మహేందర్, ఎండీ.హయత్‌అలీ, గాజులపాటి నేతాజీ, ఎండీ.షబ్బీర్‌మియా, గొట్టం కరుణాకర్‌రెడ్డి, గాజులపాటి విరోజీ, చింత మదార్, యామంకి కొంరెల్లి, ఎలందర్ పాల్గొన్నారు.

విహార యాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీలు

జనగామ: విహార యాత్రలకు వెళ్లే వారి కోసం ఆర్టీసీ జనగామ డిపో ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు డిపో మేనేజర్ ఎస్.స్వాతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలు, పాఠశాల విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు, వివిధ సంస్థల ప్రతినిధులు, పర్యాటకులు ప్రత్యేక బస్సు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాత్రలకు ఎక్స్‌ప్రెస్ డీలక్స్ బస్సు సర్వీసులు అందుబాటులో ఉన్నాయని, ప్రకటించిన యాత్ర స్థలాలే కాకుండా.. ప్రజలకు అనుకూలమైన ప్రదేశాలకు సైతం బస్సు సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 73828 52818, 99481 64847, 79819 51562 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జనగామ నుంచి విహార యాత్ర బస్సు సేవల వివరాలు

యాత్ర స్థలాలు	రోజులు	బస్సు	ఒకరికి చార్జీ
శ్రీరంగాపురం, బీచుపల్లి, జోగులాంబ	ఒకటి	ఎక్స్‌ప్రెస్	రూ.1,000
పాలకుర్తి, కురవి, కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల	రెండు	డీలక్స్	రూ.1,000
మల్లూరు, మేడారం, రామప్ప, గట్టమ్మ, భద్రకాళి టెంపుల్	ఒకటి	ఎక్స్ ప్రెస్	రూ.650
మైసిగండి, డిండి, శ్రీశైలం	రెండు	డీలక్స్	రూ.1,100
విజయవాడ, అమరావతి, భీమవరం, ద్వారకా తిరుమల	రెండు	డీలక్స్	రూ.1,400

చివరి మజిలీలో గౌరవం ఎక్కడ..?




వైకుంఠధామం ఆవరణలో వ్యర్థాలు, చెత్తా చెదారం, పెరిగిన పిచ్చి మొక్కలు

- చెత్త డంపులు.. మురికి కూపాలు
- దుర్గంధం వెదజల్లుతున్న వైకుంఠ ధామం

జనగామ: 'స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లి లాంటిదే బ్రదర్' అనే సాంగ్ పుట్టుక, మరణం ఒకటే అనే అర్థం చెబుతుంది. తల్లి కడుపులో నుంచి ప్రపంచాన్ని చూసిన వేళ కుటుంబ సభ్యులు ఎంత సంతోష పడతారో.. చివరి మజిలీలోనూ అలాగే సాగనంపాలనే 'ఆకలి రాజ్యం' సినిమా పాట ఎప్పుడూ హిట్టే. పట్టణంలోని నెహ్రూపార్కు 60 ఫీట్ల రోడ్డు ఏరియాలో ఉన్న వైకుంఠ ధామం చూస్తే చచ్చిన వ్యక్తికి సైతం అసహ్యం వేసేలా కనిపిస్తోంది. చెత్త కుప్పలు, దుర్గంధంతో మురికి కూపాన్ని తలపిస్తోంది. వర్షాలు కురిస్తే మోకాలి లోతు నీరు. అక్కడ పది నిమిషాలు కూడా కూర్చోలేని పరిస్థితి. జిల్లా కేంద్రంలోని 75 శాతం జనాభాకు ఈ వైకుంఠ ధామమే దిక్కు. చివరి మజిలీలో చనిపోయిన వ్యక్తికి గౌరవ ప్రదమైన వీడ్కోలు లేకుండా పోతున్నది. మున్సిపల్ అధికారులు ఒక్కసారి అటువైపు వెళ్లి చూస్తే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. చెత్త డంపింగ్ కేంద్రంగా మారిన వైకుంఠ ధామాన్ని ఆహ్లాదకరంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

నదీతీరం.. శోకసంద్రం

మేడిగడ్డ వద్ద గోదావరిలో ఆరుగురు విద్యార్థుల గల్లంతు



గోదావరి నది వద్ద గుమిగూడిన అంబట్‌పల్లి గ్రామస్తులు

- సాయంత్రం 6 నుంచి 11.50 వరకు సాగిన గాలింపు.. లభించని ఆచూకీ
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లిలో విషాదం

కాళేశ్వరం: ఒకటే ఊరు. వారంతా 20 ఏళ్లలోపు విద్యార్థులు. సమీప బంధువులు. అదే గ్రామానికి చెందిన బంధువుల వివాహ వేడుకల్లో ఆనందంగా గడిపారు. సరదాగా గడుపుదామని కాళేశ్వరం గోదావరి నదికి వెళ్లారు. ఈతరాని వారు ఒడ్డున నీటిలో ఆడలాడుతున్నారు. నది నీటి మట్టం పెరిగిన విషయం తెలియక మోకాళ్లోతు నీటిలో ఆడుకుంటుండగా ఒకరు ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లిపోతుండగా అతన్ని కాపాడబోయి మరొకరు.. ఇతన్ని కాపాడబోయి మరొకరు ఇలా ఆరుగురు గల్లంతయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం అంబట్‌పల్లి సమీప మేడిగడ్డ ఎగువన మూడోబ్లాక్ వద్ద శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనతో విషాదం అలుముకుంది.

అర్ధరాత్రి వరకు సాగిన గాలింపు..

రాత్రి 6 గంటలకు ఆరుగురు విద్యార్థులు నదిలో మునగగా, సుమారు 8 గంటల సమయంలో స్థానికులకు, పోలీసులకు సమాచారం అందింది. వెంటనే జిల్లా యంత్రాంగం, పోలీసులు అప్రమత్తమైంది. భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి ఆరు రెస్క్యూ బృందాలతోపాటు మహారాష్ట్ర సిరొంచకు చెందిన ఆపద మిత్ర గజ ఈతగాళ్ల బృందాలతో గాలింపు చర్యలు చేపట్టింది. కాగా రాత్రివేళ కావడం, నదిలో 5,100 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉండటంతో గాలింపు చేపట్టడం సాధ్యం కాలేదు. రాత్రి 11.50 గంటలకు గాలింపు ఆపివేశారు. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించనున్నారు. కాగా కాటారం డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి నదిలోకి దిగి ప్రవాహాన్ని అంచనా వేశారు. ఆదివారం గాలింపు కోసం రెస్క్యూ టీం ప్రత్యేక బోట్లను సిద్ధం చేసింది.

గల్లంతైన వారు..

అంబట్‌పల్లి వాసులు: పట్టి మధుసూదన్(18), పట్టి శివమనోజ్(15), తొగరి రక్షిత్(13), కర్నాల సాగర్(16)

మహాముత్తారం మండలం కొర్లకుంట వాసి బొల్లెడ్ల రాంచరణ్(17), స్తంభంపల్లి(పీపీ)కి చెందిన పసుల రాహుల్(19)

ఐదు కుటుంబాల్లో విషాదం...

పెళ్లి వేడుకలను సంతోషంగా గడిపిన ఐదు కుటుంబాల్లో ఒకే రోజులో విషాదం నెలకొంది. పట్టి వెంకటస్వామి ఇద్దరు కుమారులతో పాటు మరో నాలుగు కుటుంబాలకు చెందిన విద్యార్థులు చనిపోవడంతో ఆయా కుటుంబాలతో పాటు పెళ్లింట విషాదం నెలకొంది.

బిడ్డల కోసం ఎదురుచూస్తూ...

గల్లంతైన ఆరుగురు విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు రాత్రి నుంచి గోదావరి నది ఒడ్డునే ఉండి వేచి చూస్తున్నారు. అధికారులు గాలింపు చర్యలను నిలిపివేసి వెనుదిరిగినప్పటికీ గల్లంతైన వారి కుటుంబ సభ్యులు అక్కడే ఉండి రోదించసాగారు. తమ పిల్లలు ప్రాణాలతో బయటకు రాకపోతారా... అని వేచి చూస్తుండటం స్థానికులను కలచివేసింది.

నేనూ సచ్చిపోయేవాడినే : పట్టి శివమణి (ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్న వ్యక్తి)

స్నానం చేసేందుకు మొదట నలుగురు దిగారు. తరువాత మరో ఇద్దరు దిగారు. ఒకరి వెనుక ఒకరు నీట మునిగారు. క్షణాల్లోనే అందరూ మునగసాగారు. కన్నుమూసి తీసి తెరిచే లోపే ఆరుగురు మునిగిపోయారు. మధుసూదన్ మునిగిపోతుంటే చేయి పట్టుకొని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన నీట మునిగాడు. దీంతో నేనే భయపడి ఒడ్డుకు చేరుకున్నా.

అడ్డుకున్నప్పుడు ఆగి ఉంటే..

ఈతకు వెళ్లిన వారిలో అంబట్‌పల్లి గ్రామానికి చెందిన పట్టి వెంకటస్వామికి కుమారులు మధుసూదన్, శివమనోజ్ కూడా ఉన్నారు. వీరితో పాటు మిగిలిన ఐదుగురు గోదావరి నదిలో స్నానం చేసేందుకు వెళ్తుండగా నదిలో నీటి మట్టం ఎక్కువగా ఉందని, స్నానానికి వెళ్లొద్దని వెంకటస్వామి వారించాడు. అయినా వారు వినకుండా వెళ్తామనడంతో అతను కూడా వెంటవెళ్లాడు. వీరు లోపలికి వెళ్తుండగా వెళ్లొద్దని, వెనక్కి రండని పిలిచాడు. కానీ అప్పటికే లోతులోకి వెళ్లిపోయారు. కళ్లెదుటే మునిగిపోతున్నా వెంకటస్వామిది ఏమీ చేయలేని పరిస్థితి.



గోదావరిలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న రెస్క్యూటీం, పోలీసులు



ఇద్దరు కుమారులు గల్లంతు కావడంతో గోదావరి నది వద్ద రోదిస్తున్న పట్టి వెంకటస్వామి కుటుంబ సభ్యులు



బోరున విలపిస్తున్న గల్లంతైన వారి కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

వడదెబ్బతో వ్యక్తి మృతి


అంతయ్య (ఫైల్)

జనగామ: జనగామ పట్టణం బీరప్పగడ్డకు చెందిన నేతి అంతయ్య(70) వడదెబ్బకు గురై శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. రోజువారీ పని ముగించుకుని ఇంటికి చేరిన ఆయన అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు జిల్లా ప్రధాన జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అంతయ్యకు భార్య సుగుణమ్మ, కుమారుడు ఉపేందర్, కుమార్తె ఉమ ఉన్నారు.

పాముకాటుతో..


యాకయ్య(ఫైల్)

సంగెం: వరంగల్ జిల్లా సంగెం మండలానికి చెందిన వ్యక్తి పాముకాటుకు గురై ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తీగరాజుపల్లి గ్రామానికి చెందిన చాగంటి యాకయ్య(56) వ్యవసాయం చేసుకుంటూ భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడిని పోషించుకుంటున్నాడు. నెల రోజుల క్రితం సైకిల్‌పై నుంచి పడిన యాకయ్య ఇంటి వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భోజనాల అనంతరం ఇంటి ముందున్న రేకుల షెడ్ కింద యాకయ్య, అతని కుమారుడు రంజిత్ నిద్రించారు. శనివారం తెల్లవారుజామున యాకయ్య ఏదో కుట్టినట్లయిందని కుమారుడు రంజిత్‌కు తెలియజేశాడు. పరిశీలించగా.. బొడ్డు కింద, పురుషాంగంపైన పాము కాటు వేసినట్లు కన్పించింది. చుట్టుపక్కల వారి సాయంతో వెతకగా.. కట్ల పాము కన్పించింది. దీంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా శనివారం ఉదయం యాకయ్య మృతి చెందాడు. కుమారుడు రంజిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

భూమి కబ్జా చేశారని దివ్యాంగుడి ఆందోళన

పాలకుర్తి టౌన్: భూమిని కబ్జా చేశారని తనకు న్యాయం చేయాలని మండుటెండలో దివ్యాంగుడు ఆందోళన చేసిన సంఘటన శనివారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో చోటు చేసుకుంది. మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు రూపాని సాలయ్య 16 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేశారని తనకు న్యాయం చేయాలని మండల కేంద్రంలోని ఆందోళన చేశాడు. ఈ సందర్భంగా దివ్యాంగుడు సాలయ్య మాట్లాడుతూ మల్లంపల్లి గ్రామానికి చెందిన చింతం మహేందర్ వద్ద 5.20 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి తన భార్య యాదమ్మ పేరున రిజిస్ట్రేషన్ కూడా చేయించానని తెలిపాడు. ఇప్పుడు అదే గ్రామానికి చెందిన చింతం వెంకన్న అనే వ్యక్తి తాను కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసి సాగు చేసుకుంటున్నాడని తనకు నాయ్యం చేయాలని కలెక్టర్‌ను కోరారు.

వినియోగం వెనుక ప్రమాదం

ప్లాస్టిక్ బాటిళ్లతో రోగాలు
- అడుగు భాగంలో బ్యాక్టీరియా వృద్ధి
- రోజు శుభ్రం చేసుకోవాల్సిందే.. లేదంటే ప్రమాదమే..
- వ్యాధులను కొని తెచ్చుకోవద్దంటున్న వైద్య నిపుణులు


ప్లాంట్ నుంచి తెచ్చిన కూల్ వాటర్ క్యాన్లు


రంగులతో ఆకర్షణీయంగా కనిపిస్తున్న వాటర్ బాటిళ్లు

ఖిలా వరంగల్ : మార్కెట్లోకి వెళ్లిన వెంటనే ప్రధానంగా ఆకర్షించేవి ప్లాస్టిక్ బాటిళ్లు. రంగు బాగుందనో.. ఆకృతి బాగుందనో.. ధర తక్కువనో.. ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తుంటారు. అందుకే ప్రతి ఇంటిలోనూ ఇవే దర్శనమిస్తుంటాయి. ఈ క్రమంలో వరంగల్ నగరంతోపాటు ఉమ్మడి జిల్లాలో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం భారీగా పెరిగింది. అయితే వాటి వినియోగం వెనుక ప్రమాదం ఉందంటున్నారు వైద్య నిపుణులు. ప్లాస్టిక్ బాటిళ్లను సక్రమంగా శుభ్రం చేయకుంటే రోగాల బారిన పడడం ఖాయమని వారు హెచ్చరిస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ప్లాస్టిక్ బాటిళ్ల ద్వారా నీరు తాగుతున్నారు. నేడు ఏ అవసరానికైనా ప్లాస్టిక్ బాటిళ్లు తప్పనిసరి అయ్యాయి. తాగునీరు, మజ్జిగ, శీతల పానీయాలు.. ఇలా ఏది తాగాలన్నా .. కొనాలన్నా.. ప్రజలు వాటిపైనే ఆధారపడుతున్నారు. అయితే వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నా.. శుభ్రం చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. మినరల్ ప్లాంట్‌లో చల్లటి నీరు ఇచ్చే డబ్బాలు శుభ్రపర్చకుండానే సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటిని తాగడంతోనే జ్వరం, గొంతునొప్పి, జలుబుకు గురవుతున్నారు. ఫలితంగా రోగాలు కొని తెచ్చుకుంటున్నాం.

ప్లాస్టిక్ బాటిళ్లను తరచూ శుభ్రం చేయాలి..
నిత్యం వినియోగించే ప్లాస్టిక్ బాటిళ్లను తరచూ శుభ్రం చేయాలి. లేనిపక్షంలో వాటి అడుగు భాగంలో జిడ్డు పదార్థం ఏర్పడుతుంది. దీనిలో బ్యాక్టీరియా చేరి పెద్ద ఎత్తున వృద్ధి చెందుతుంది. దీనివల్ల గొంతు నొప్పి, దగ్గు, జీర్ణకోశ, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా నాసిరకం ప్లాస్టిక్‌తో తయారయ్యే బాటిళ్లలో సులభంగా నీరు కలుషితమవుతుంది. ఇదిలా ఉండగా మినరల్ వాటర్ క్యాన్లతో వ్యాధులు వస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వాటర్ క్యాన్లను నిర్వాహకులు పెద్దగా శుభ్రం చేయరు. ఇలాంటి క్యాన్లను వినియోగించడం కన్నా స్టీల్ బాటిళ్లు, బిందెలు, రాగి పాత్రల్లో నీరు తాగితే ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. ఏదేమైనా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడొద్దని వారు సూచిస్తున్నారు.

అనర్థాలివే..
ప్లాస్టిక్ క్యాన్లు, బాటిళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే బ్యాక్టీరియా చేరుతుంది. వాటిల్లో గోనో కొక్కల్స్, న్యూమో కొక్కల్స్ వంటి బ్యాక్టీరియా సులభంగా వృద్ధి చెందుతుంది. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల గొంతు, జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వాంతులు, విరేచనాలు జర్వం రావొచ్చు. క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణించే అవకాశాలు ఎక్కువ..

ప్లాస్టిక్ బాటిళ్లు వాడే వారికి సూచనలు
నాణ్యమైన నీటి బాటిళ్లను కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించేవి కొనుగోలు చేయొద్దు..రోజు వేడినీటితో బాటిళ్లను శుభ్రం చేసుకోవాలి. బ్రష్‌తో అడుగు భాగం కడగాలి.. పూర్తిగా ఎండేలా చూసుకోవాలి. ఇందులో నీరు ఎక్కువగా నిల్వ లేకుండా చూసుకోవాలి.. బాటిళ్లను తరచూ మారుస్తూ ఉండాలి.

తరచూ శుభ్రం చేయాలి..



పాఠశాలలకు వెళ్లే చిన్నారులే ఎక్కువ ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగిస్తుంటారు. వివిధ రూపాల్లో ఉండే వాటికి పిల్లలు బాగా ఆకర్షితులవుతుంటారు. అయితే వాటిని శుభ్రం చేయకపోతే అడుగుభాగంలో ఉండే బ్యాక్టీరియా కడుపులోకి ప్రవేశిస్తుంది. క్రమంగా పిల్లలు టైఫాయిడ్, వాంతులు, విరేచనాలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులను నివారించాలంటే బాటిళ్లను వాడకపోవడమే మంచిది.

– డాక్టర్ మహ్మద్ అజీమ్, వరంగల్

అప్రమత్తంగా ఉండాలి..



నాసిరకం ప్లాస్టిక్ బాటిళ్లపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. పిల్లలు వినియోగించడంలో చూపించే శ్రద్ధ శుభ్రపరచడంలో చూపించడం లేదు. దీంతో బాటిల్ అడుగు భాగంలో బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. తద్వారా పిల్లలకు వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువ. ముఖ్యంగా జీర్ణకోశ, గొంతు వ్యాధులు వస్తాయి. తరచూ జలుబు వస్తుంది. ఇవి రాకుండా ఉండాలంటే ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగించొద్దు.. వాడితే రోజూ శుభ్రం చేయాలి.

– రేవూరి మాధవి, హెచ్‌ఎం,కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాల వరంగల్

1,200 మంది విద్యార్థులకు ఉద్యోగాలు


సక్సెస్ మీట్‌లో పాల్గొన్న ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి, విద్యార్థులు

హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీలో 1,200 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడంపై శుక్రవారం సాయంత్రం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విజయాలు పరిశ్రమ అవసరాలను గుర్తించి విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించిన ఫలితంగా సాధ్యమయ్యాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ అన్ని కోణాల్లో వారిని అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. ఈ విజయాల్లో కీలకంగా పనిచేసిన డీన్‌లు, వివిధ శాఖాధికారులు, డైరెక్టర్లు, ప్లేస్‌మెంట్ సమన్వయ కర్తల కృషిని అభినందించారు. ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించేందుకు అనేక అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేట్ డైరెక్టర్ జి.సునీల్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, ప్రొ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ మహేష్‌తోపాటు వివిధ విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మహిళా క్రికెట్ పోటీలు

- హెచ్‌సీఏ సంయుక్త కార్యదర్శి బస్వరాజు
- ముగిసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు


సర్టిఫికెట్లు అందుకున్న క్రీడాకారులతో క్రికెట్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: ప్రతిభ గల మహిళా క్రీడాకారులను గుర్తించేందుకు త్వరలో మహిళా క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బస్వరాజు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఆరు జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన ఉచిత క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకలు కరుణాపురంలోని వంగాలపల్లి క్రికెట్ మైదానంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా బస్వరాజు హాజరై క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సదాశివ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బస్వరాజు పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధే ధ్యేయంగా హెచ్‌సీఏ అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించేందుకు నిరంతరంగా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డబ్ల్యూడీసీఏ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో నిరంతర క్రికెట్ క్యాంపుల ఆవశ్యకతను గుర్తుచేస్తూ వంగాలపల్లి గ్రౌండ్‌ను హెచ్‌సీఏ పరిధిలోకి తీసుకోవాలని ప్రతిపాదించారు. రాబోయే జనరల్ బాడీ మీటింగ్‌లో జిల్లాలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో క్రికెట్ అకాడమికి అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ క్లబ్ కార్యదర్శులు భార్గవ్, శంకర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ఉపేందర్, కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, అభివినయ్, అజయ్‌సారథి పాల్గొన్నారు.

బాక్సింగ్ ఎంపికల్లో గందరగోళం

- నిర్వాహకులతో తల్లిదండ్రుల వాగ్వాదం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వరంగల్‌స్పోర్ట్స్:హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్ హాల్‌లో శనివారం నిర్వహించిన బాక్సింగ్ ఎంపికల్లో గందరగోళ వాతావరణం ఏర్పడింది. నిర్వాహకులు అనుసరిస్తున్న తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు.. అసోసియేషన్ బాధ్యులతో వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ నిర్వాహకులతీరు మారకపోవడంతో క్రీడాకారుల తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్.. అసోసియేషన్ పెద్దలు, తల్లిదండ్రులకు సర్దిచెప్పి పంపించారు. క్రీడాకారులు, తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్స్ (అండర్–16) బాలబాలికల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 10, 11వ తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సుమారు 20 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు. ఎంపికల్లో ఒకే వెయిట్ కేటగిరీలో ఒక్కొక్కరే ఉండడంతో డిస్‌క్వాలీఫై చేస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ తెలిపారు. దీంతో క్రీడాకారులు, తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వెయిట్ కేటగిరీలో పోటీ లేకపోతే రాష్ట్రస్థాయికి ఎంపిక చేయొచ్చు కదా.. అని ప్రశ్నించారు. గతంలో అలానే చేసే వారని ఇప్పుడు కొత్త నిబంధనలు ఏంటని వాగ్వాదానికి దిగారు. సొంత నిబంధనలు అమలు చేయడం వలన క్రీడాకారులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకూ వినకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కాగా, 20 మందిలో ముగ్గురు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు నిర్వహణ కార్యదర్శి రాజేందర్ తెలిపారు.

15న ఉమ్మడి జిల్లా చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి అండర్–13 చదరంగ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మంటపంలో నిర్వహించే ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు జనవరి 01, 2012 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. క్రీడాకారులు వెంట చెస్ బోర్డు తీసుకుని రావాలని తెలిపారు. గెలుపొందినవారిని హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 90595 22986 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

‘అక్షర వాచస్పతి’ దాశరథి

- నేడు రంగాచార్యుల వర్ధంతి


రంగాచార్యులు(ఫైల్)

చిన్నగూడూరు: అక్షరమే ఆయుధంగా తెలంగాణ మలిదశ ఉద్యమానికి నాంది పలికిన ‘అక్షర వాచస్పతి’(జ్ఞానానికి అధిపతి) దాశరథి రంగాచార్య. మానుకోట జిల్లాలోని ఉద్యమాల పురిటిగడ్డ చిన్నగూడూరు ప్రస్తుతం మండల కేంద్రంగా కొనసాగుతోందంటే కారణం దాశరథి సోదరులు (దాశరథి కృష్ణమాచార్యులు, రంగాచార్యులు) స్ఫూర్తితోనే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. నేడు(ఆదివారం) దాశరథి రంగాచార్యుల వర్ధంతి సందర్భంగా ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

చిన్నగూడూరులో వైష్ణవ సంప్రదాయ కుటుంబంలో వెంకటాచార్యులు– వెంకటమ్మ దంపతులకు 24 ఆగష్టు 1928 సంవత్సరంలో దాశరథి రంగాచార్యులు జన్మించారు. విద్యాభ్యాసం ఖమ్మం జిల్లాలో సాగింది. 12 ఏళ్లకే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నాడు. తెలంగాణ పల్లెల్లో నాటి జీవన విధానాన్ని ఆయన రాసిన నవలల్లో కళ్లకు కట్టినట్లు చూపించారు. చిల్లర దేవుళ్లు, మోదుగుపూలు అనే నవలలు ఆయనకు ఎనలేని కీర్తిని సంపాదించి పెట్టాయి. రంగాచార్యులు సోదరుడు దాశరథి కృష్ణమాచార్యులు నిజాం నవాబు పాలనను ఎదిరించి ‘తెలంగాణ కోటి రతనాల వీణ’ అని తన కవిత్వంతో వెలుగెత్తి చాటి తెలంగాణ పోరాట వీరుడు, స్వాతంత్ర సమరయోధుడిగా పేరొందాడు. తమ్ముడు రంగాచార్య వచనంతో అన్న కృష్ణమాచార్యుల బాటలో నడిచి మలిదశ ఉద్యమానికి ఊపిరిపోశాడు. నిజాం పాలనలో అరాచకాలు, పెత్తందార్ల దోపిడీ నుంచి ప్రజలను విముక్తి చేసేందుకు ఉద్యమబాటలో నడిచాడు. దాశరథి రంగాచార్యులు సాహితీవేత్తగా, సాయుధ పోరాట యోధుడిగా, బహూముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్నారు. ఈయన రాసిన నవలలు తెలంగాణకే పరిమితం కాకుండా భారతదేశమంతటా కీర్తి గడించాయి. ఉపాధ్యాయుడిగా, గ్రంథాలయ నిర్వాహకుడిగా, సికింద్రాబాద్ పురపాలక శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తించారు.

పురస్కారాలు..


మండల కేంద్రంలోని రంగాచార్య విగ్రహం

వేదాలు, ఉపనిషత్తులను తెలుగులోకి అనువదించారు రంగాచార్యులు. రామాయణ, భారత, భాగవతాలను సరళవచనంలో రాశారు. ఆయన రాసిన చిల్లర దేవుళ్లు రచనకు ఆంధ్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1980 సంవత్సరంలో వెంకటశివయ్య సాహితీ పురస్కారం, 2000 సంవత్సరంలో తెలుగు విశ్వ విద్యాలయం నుంచి సాహిత్యంలో విశిష్ట పురస్కారం అందుకున్నారు. తెలుగు సాహిత్య రచనల్లో సుస్థిర స్థానం సంపాదించిన ఆయన 2015 జూన్ 8న తుది శ్వాస విడిచారు. దాశరథి సోదరులు పుట్టిన చిన్నగూడూరులో వారి జ్ఞాపకార్థంగా దాశరథి గ్రంథాలయం ఏర్పాటు చేసి, చిన్నగూడూరును దాశరథి గూడూరుగా నామకరణం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

‘ఓపెన్ స్కూల్’ పరీక్షల ఫలితాలు విడుదల

- ఉమ్మడి జిల్లాలో టెన్త్‌లో 69.04 శాతం..
- ఇంటర్‌లో 67.17 శాతం ఉత్తీర్ణత

విద్యారణ్యపురి: ఈ ఏడాది ఏప్రిల్–మే లో నిర్వహించిన ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో టెన్త్ పరీక్షలకు 2,478 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 1,711 మంది (69.04 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు 4,449 మంది హాజరుకాగా 2,989 మంది విద్యార్థులు(67.17శాతం) ఉత్తీర్ణత సాధించారని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేట్ అనగోని సదానందం తెలిపారు.

జిల్లాల వారీగా ఉత్తీర్ణత వివరాలు..
- హనుమకొండ జిల్లాలో టెన్త్‌లో 390 మంది విద్యార్థులకు గాను 318మంది (81శాతం), ఇంటర్‌లో 997 మందికిగాను 673 మంది (67శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- వరంగల్ జిల్లాలో టెన్త్‌లో 476 మందికిగాను 127 మంది (27శాతం), ఇంటర్‌లో 650 మందిలో 323 (49శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- మహబూబాబాద్ జిల్లాలో టెన్త్‌లో 441 మందికిగాను 337 మంది (76 శాతం), ఇంటర్‌లో 657మందికిగాను 488 మంది (74శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- జనగామ జిల్లాలో 349మందికిగాను 293మంది (84శాతం), ఇంటర్‌లో 942మందిలో 777 మంది ఉత్తీర్ణత (82.1శాతం) సాధించారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టెన్త్‌లో 269 మందికిగాను 216 మంది (80శాతం), ఇంటర్‌లో 394 మందికిగాను 302 మంది (76.6శాతం) ఉత్తీర్ణత సాధించారు.
- ములుగు జిల్లాలో 553 మంది విద్యార్థులకుగాను 420 మంది (76 శాతం), ఇంటర్‌లో 809 మందికిగాను 426 మంది విద్యార్థులు (51.7శాతం) ఉత్తీర్ణత సాధించారు.

చోరీలకు పాల్పడిన నలుగురి అరెస్ట్


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ

కమలాపూర్: తాళాలు పగులగొట్టి ఆలయాల్లోకి చొరబడి హుండీలను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. శనివారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని గూడూరు క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా జమ్మికుంట మారుతినగర్‌కు చెందిన జానబోయిన అరవింద్, హుజూరాబాద్ కొత్తపల్లికి చెందిన గుల్ల ప్రవీణ్, హుజూరాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లికి చెందిన గట్టు మనోజ్, జమ్మికుంట ఇందిరానగర్‌కు చెందిన శ్రీరాముల రాజేష్ అనే నలుగురు రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చారని తెలిపారు. వాహనాలతోపాటు వారిని తనిఖీ చేయగా వారి వద్ద రూ.38 వేలు లభించాయని, వివరాలు అడగ్గా.. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. దీంతో కమలాపూర్ మండలంలోని మర్రిపల్లిగూడెం, భీంపల్లి గ్రామాల్లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాలతోపాటు జమ్మికుంట, దామెర, శాయంపేట, ఆత్మకూరు మండలాల్లోని ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి రూ.38 వేల నగదు, 2 బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై వీరభద్రరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చదువుల కల చెదిరింది..

- ఇంటర్ చదివేందుకు సిద్ధమవుతూ అనంత లోకాలకు..
- రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి
- ప్రాణాపాయస్థితిలో తల్లి
- మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు


నేహ (ఫైల్)


ఘటనా స్థలంలో తీవ్రగాయాలతో తల్లి సరిత


కుమార్తె మృతదేహంపై పడి రోదిస్తున్న తండ్రి వెంకన్న

నెహ్రూసెంటర్/కురవి: టెన్త్ వార్షిక పరీక్షల్లో ఫస్ట్ క్లాసులో పాసైన విద్యార్థిని ఇంటర్మీడియట్ చదివేందుకు సిద్ధమవుతూ విధి ఆడిన వింత నాటకంలో రోడ్డు ప్రమాదానికి గురై కానరాని లోకాలకు వెళ్లిపోయింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మానుకోట జిల్లా కురవి మండలానికి చెందిన తొడుసు వెంకన్న, సరిత దంపతుల కుమార్తె నేహ (15) ఇంటర్ చదివేందుకు సిద్ధమవుతుంది. ఈ క్రమంలో తన తల్లి సరితతో కలిసి జిల్లా కేంద్రంలోని ఓ కంటి ఆస్పత్రిలో చూపించుకుని, దుస్తులు కొనుగోలు చేసి ఆటోలో తిరుగుపయనమయ్యారు. కురవి శివారు లింగ్యాతండా సమీపంలో 365 జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న ఆటోను అశోక్ లేలాండ్ వాహనం ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. ఈప్రమాదంలో నేహ అక్కడికక్కడే మృతి చెందగా తల్లి సరిత, డ్రైవర్ కానుగంటి రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ రాజు, తల్లి సరితను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ కురవి మండలం రాజోలు గ్రామానికి చెందిన నెమలి వంశీని ప్రత్యక్ష సాక్షులు పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న కురవి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తండ్రి వెంకన్న కుమార్తె నేహ మృతదేహంపై పడి రోదించిన తీరు ప్రతి ఒక్కరినీ కలిచివేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కురవి ఎస్సై గంగ్రాతి సతీష్ తెలిపారు. ఇదిలా ఉండగా.. తీవ్ర గాయాలపాలైన సరిత, రాజుకు ఎక్స్‌రే, సీటీ స్కాన్ అవసరముండగా ప్రభుత్వ ఆస్పత్రిలో టెక్నిషియన్స్ అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ సెంటర్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని బంధువుల ఆవేదన వ్యక్తం చేశారు. నేహ కుటుంబాన్ని ఆదుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుడు జ్యోతిబసు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

ఇళ్లు రాలేదనే తప్పుడు ప్రచారం..

- డబ్బులు ఇచ్చినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్
- ఆరోపణలపై హౌసింగ్ పీడీ విచారణ
- ఇందిరమ్మ ఇంటి కోసం డబ్బులు ఇవ్వలేదని వాంగ్మూలం

హసన్‌పర్తి: ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేశా.. ఇల్లు రాలేదు. ఇందిరమ్మ పథకంలో పేరు రాలేదనే ఇంటికి రూ.లక్ష అడుగుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్ చేశానని నాగారానికి చెందిన బండారు అనిత.. హౌసింగ్ పీడీ విచారణలో అంగీకరించింది. వివరాలిలా ఉన్నాయి.. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రూ.లక్ష అడుగుతున్నారని నాగారం గ్రామానికి చెందిన అనిత ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వీడియో పోస్ట్ చేసింది. దీంతో స్థానిక పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు హౌజింగ్ పీడీ రవీందర్‌నాయక్ శనివారం సాయంత్రం నాగారంలో విచారణ చేపట్టారు. బండారు అనితను పిలిచి మాట్లాడారు. ఆమె వాంగ్మూలం నమోదు చేశారు. అనంతరం హౌజింగ్ పీడీ రవీందర్‌నాయక్ వివరాలు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదనే అనిత సామాజిక మాధ్యమ వేదికగా తప్పుడు ఆరో0 చేసినట్లు ఒప్పుకుందన్నారు. అర్హులైనవారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఇళ్ల మంజూరుకు ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.